# పేరు మీరే పెట్టండి

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి.



ఆకాశవాణిలో పదిహేనేళ్ళుగా పని చేస్తూ పాతికేళ్ళుగా అసంఖ్యాకమైన కథల్ని, నాటికల్ని, నాటకాల్ని, ఓ రెండు మూడు సినిమాలకి కథ, మాటల్ని రచించి, అనేక నాటకాల్లో నటించి–ఇటు కలం ద్వారానేకాక అటు గళం ద్వారా కూడా అఖిలాంధ్ర పాఠకులకి, శ్రోతలకి పరిచయమైన సహృదయులు శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి "ఓ పాటకి బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఎంత అవసరమో కథలకి భాషాపరమైన అవగాహనకూడా అంతే అవసరం" అని నమ్మిన వీరు "సాధన చేస్తూ, కొన్ని విషయాల్లో ఇంకొంచెం శ్రద్ధ తీసుకుంటే, ఈ కథలు రాసిన వారి నుంచి చాలా మంది రచయితలు పుట్టుకొస్తారని" అభిప్రాయం వెలిబుచ్చారు.

సాయంత్రం అయిదు అవుతుంది. ప్రతిరోజు సాయంకాలం మా ఇంటి వరండాలో నిల్చోడం నాకీ మధ్య బాగా అలవాటైంది. అందుక్కారణం మా ఎదురింట్లోకి క్రొత్తగా వచ్చిన కుటుంబం. అయితే ఇంత క్రితం ఆ ఇంట్లో ఎవరూ క్రొత్తగా రాలేదని కాదు. అప్పుడు నేనిలా వరండాలో నిల్చోలేదు.

ఇప్పుడు చేరిన ఫ్యామిల్లో ఓ అమ్మాయి ఉంది. ఈఅమ్మాయి అందరమ్మాయిల్లా నావైపు జాలిగా చూడదు– ఆర్తిగా, అభిమానంగా చూస్తుంది.

ఆ అమ్మాయి ప్రతిరోజు సాయంకాలం మల్లిపూలు కోయడానికివచ్చి, వాటిని అక్కడే మాల కట్టి ప్రక్క వీధిలోని ఆంజనేయస్వామి గుడికి తీసికెళ్తుంది. మధ్య మధ్యలో నావైపు అలా అలా చూసి ఇలా చూపులు తిప్పుకుంటుంది. ఆమె నావంక ఎంతకీ చూడకపోతే నా కళ్ళలోని కాంతి కిరణాలు వేడిగా వెళ్ళి నా అసహనాన్ని తెలియచేస్తే నా వైపు ఓ చూపు అలా విసిరి నా బాధ తీరుస్తుంది.

ఈ రోజు ఆమెతో ఎలాగైనా మాట్లాడాలనుకున్నాను. అందుకే ఆమె వెంట నేను కూడా గుడికి బయలు దేరాను. పూజ ముగించుకొని ఇంటికి బయలుదేరింది.

"ఏమండి"! అంటూ పిలిచాను. ఎవరా అనుకొని వెనక్కి తిరిగింది.

"నమస్కారమండీ!" అంటూ ఎడమ చేత్తో నమస్కారం చేశాను. ఆవిడ కూడా నమస్కారం చేస్తున్నట్లు చేతులెత్తి అటూ ఇటూ చూసింది బెదురుగా.

"నా పేరు రాము. మీ ఎదురింట్లో ఉంటున్నాను. మీకు తెలుసనుకుంటాను?"

తెలుసన్నట్లు తల ఊపింది.

"నేను గ్రాడ్యుయేట్ నండి! జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నాను. చిన్నప్పటినుండి ఎడమ చేయి అలవాటు కావడం-వలన ఆ ఉద్యోగమన్నా దొరికింది!"

మళ్ళీ ఇటువంటి సమయం దొరుకుతుందో లేదోనన్నట్లుగా వాగేస్తున్నాను.

"మీ కేమన్నా బోర్ కొడ్తున్నానా?" ఇంతకీ మీ పేరు చెప్పనే లేదు?"

దిగ్గున తలఎత్తింది. ఆ కళ్ళల్లోన్నీ కరుచెప్పాలన్న వేదన, చెప్పలేకపోతున్నందుకు ఆవేదన చకచకా ఇంట్లోకెళ్ళిపోయింది.

కోపం వచ్చిందేమో? పేరడక్కుండా ఉండాల్సింది. ఎందుకలా వెళ్ళిపోయిందో?

రాత్రి అమ్మచెప్పిన విషయం విని నేను పాతాళంలోకి కుంగిపోయినట్లు బాధపడ్డాను.

"మరుసటి రోజు గుడి నుంచి వస్తూ నేను పిలవకున్నా తానే వచ్చి ఓ చీటీ ఇచ్చింది. అందులో 'నా పేరు కీర్తన' అని ఉంది.

"క్షమించండి. మీ విషయం అమ్మ చెప్పే వరకు నాకు తెలీదు." పర్వాలేదన్నట్లుగా చూసింది. పాపం, ఎంత బాధ పడిందో! "మనకీలోకం మనం మోయలేనంత జాలిని చూపిస్తుందే కాని, కావలసినంత సహాయం చేయలేదు. అవిటివాడి బాధ అవిటివాడికే తెల్సు. అందుకే నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను-మీకిష్టమైతేచెప్పండి!"అన్నాను. ఒప్పుకోక పోతుందా అన్న చిరు ఆశతో.

కీర్తన దిగ్గున తలఎత్తింది.

"మీ మనసుని నొప్పించి ఉంటే మన్నించండి. ఈ అవిటివాన్ని చేసుకోడానికి ఎవరూ ముందుకు రారని తెలుసు. ప్రేమ పేరుతో సినిమాలకి, పార్కులకి వెళ్ళేంత పరిచయం లేకపోయినా, చూపులతో జీవితానికి సరిపడే అనుభవాల్ని పంచుకున్నాము.

ప్లీజ్, నా అభ్యర్థనని అర్థం చేసుకోండి. మీ అభిప్రాయం చెప్పండి!" కీర్తన కళ్ళు స్థిరంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా ఉన్నాయి.

ఇపుడు మమ్మల్నందరూ చిలకా గోరింకల్లా ఉన్నామంటారు! అఫ్‌కోర్స్. వాటిలా మేము పాడలేకపోవచ్చు, ఎగరలేకపోవచ్చు.

—ప్యాపలి శ్రీరాములు

*స్రవంతి నెం: 11లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ బి.రఘురామరాజు పెట్టినపేరు: దొంగలకు దొంగ.*

## మంచివాడు

ప్రభాకర్ మనసంతా ఏదో గజిబిజిగావుంది. ఇదీ అని చెప్పలేని ఏదో అనీజీనెస్. తనకూ ఓ వదిన రాబోతుందన్న మాట విన్నప్పటినుండీ మనసు మనసులోలేదు.

ఇప్పుడు వదినగారొస్తే అదకూడ మిగలదు కాబోలు. అవును, అంతే జరుగుతుంది. తన ఫ్రెండ్ భాస్కర్‌గాడి వదినలాగే తనకు రాబోయేవదినకూడా తననీ, అక్కయ్యనీ తన్ని బయటికి తరిమేస్తే తమ బ్రతుకుకేమిటి? తను కూడా వాడిలాగా హోటల్‌లో సర్వర్‌గా చేరిపోవాలా? అపుడు శాంతక్కగతేమిటి! భాస్కర్ గాడి అక్కలాగా ఎవడితోనైనా లేచిపోతుందేమో! అలా తలచుకుంటుంటూనే చాల అసహ్యమేసింది ప్రభాకరానికి.

తనకు తెలిసినంత వరకూ ఎవరి వదినలు కూడా ఇంట్లో వ్యక్తుల్ని సవ్యంగా చూచినట్లు గుర్తులేదు.